TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 294 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.20.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతానికి కృషి



బంజారాహిల్స్ :అమృత్ తెలంగాణ: ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని.. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం, ఆస్తి నష్టాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు.

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణించాలని తెలిపారు. ఆ సమయంలో సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేస్తూ అత్యాధునిక పరికరాలను వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలని సూచించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఆలస్యం చేయకుండా ఘటనా స్థలానికి చేరుకుని వైద్య, రక్షణ సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుండగా, పట్టణాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు.

కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి సహాయక చర్యలను పరిశీలించారు. రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారం మాత్రమే చేరాలని, పుకార్లను నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్‌మాన్, హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా "ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది.


అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఐఎఫ్‌ఎంఐఎస్-హెచ్‌ఆర్ పోర్టల్లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సమాచారం నమోదు చేయాలని లేదంటే భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## గ్రామీణ యువతకు స్వయం ఉపాధే లక్ష్యం



కోహిర్ :అమృత్ తెలంగాణ: గ్రామీణ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే తమ ధ్యేయమని, ఎస్ఐహెచ్‌ఎంకు పూర్వ వైభవం తీసుకొస్తామని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్‌ఎం) సంస్థలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితోపాటు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించారు. పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఎస్ఐహెచ్‌ఎంను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్‌ఎంను పున: ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎస్ఐహెచ్‌ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన ఈ యుగంలో, ప్రయివేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యువత ఈ అవకాశాలను అందుకోవడానికి పర్యాటక, ఆతిథ్య (హాస్పిటాలిటీ) రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలాని కనుగుణంగా మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరికులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మెన్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ పోక్సో కేసులో మరో సిట్ ఏర్పాటు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత, అవమానకర ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ సిట్ పనిచేస్తుందని, న్యాయవ్యవస్థపై జరిగిన ఈ దుష్ప్రచార మూలాలను పూర్తిగా వెలికితీస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కుల వివక్ష..బోనాలతో రోడ్డుపై దళితుల రాస్తారోకో




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తమను ఆలయంలోకి రానివ్వలేదని దళితులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగిన సంఘటనలు పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో మంగళవారం జరిగింది. పెగడపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన దళితులు బోనాలతో ఎల్లమ్మ తల్లి ఆలయానికి మొక్కులు చెల్లించేందుకు సోమవారం రాత్రి వెళ్లారు. అయితే గౌడ సంఘం సభ్యులు కొందరు మహిళలు మమ్మల్ని గుడిలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని దళితులు మండిపడ్డారు. కుల వివక్షతో తమను అడ్డుకున్నారని బోనాలతో మంగళవారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, సుల్తానాబాద్ సీఐ రంజిత్ రెడ్డితో పాటు ఎస్ఐలు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. ఈ ఘటన పై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## లులు మాల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ -- కుళ్లిన కూరగాయులు.. పురుగులు



హైదరాబాద్ .అమృత్ తెలంగాణ:నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో లభించే ఆహార పదార్థాల నాణ్యతపై మరోసారి పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖూనదీ పరిధిలోని ప్రసిద్ధ లులు మాల్‌లో కొనుగోలు చేసిన ఒక మిక్చర్ ప్యాకెట్‌లో ఫ్రైడ్ బల్లి వచ్చిందంటూ గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఒక వీడియో విపరీతంగా వైరల్ అయ్యింది. దీనిపై ఫిర్యాదు అందడంతో అప్రమత్తమైన తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం లులు హైపర్ మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మాల్‌లోని ఇన్‌హౌస్ కిచెన్‌లో పరిశుభ్రత లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల సోదాల్లో కిచెన్ పరిసరాలు, స్టోరేజ్ రూములలో పెద్ద ఎత్తున పురుగులు, కీటకాలు తిరుగుతున్నట్లు తేలింది. ఆహార తయారీకి సిద్ధంగా ఉంచిన కూరగాయలు పూర్తిగా కుళ్లిపోయి ఉన్నట్లు అధికారులు గుర్తించి వాటిని అక్కడికక్కడే పారవేయించారు.

ఇన్-హౌస్ కిచెన్‌లో లోపాలు ....

వంటగదిలో అత్యంత అధ్వాన్నమైన పరిశుభ్రత పరిస్థితులు కనిపించాయి.

ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన మిగిలిపోయిన ఆహారాన్ని అధికారులు అక్కడికక్కడే పారవేయించారు.

వంటగది పరిసరాల్లో కీటకాలు ఉన్నట్లు గుర్తించారు.

కుళ్ళిపోయిన కూరగాయలు లభ్యమయ్యాయి.

ప్యాక్ చేసిన కొన్ని ఆహార పదార్థాల గడువు ముగిసిపోవడానికి దగ్గరగా ఉన్నప్పటికీ... వాటిపై చిరిగిన, ట్యాంపరింగ్ చేసేలా లేబుళ్లను అంటించినట్లు గుర్తించారు.

రిటైల్ ఏరియాలో లోపాలు .... శనగపిండి, గోధుమపిండి, పప్పుధాన్యాలలో పురుగులు పట్టినట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఫ్సాసాయ్ లైసెన్స్‌తో ఉన్న ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను గుర్తించారు. లేబులింగ్, డిస్ప్లే నియమాలను ఉల్లంఘించినట్లు తేలింది. కొన్ని ఉత్పత్తులపై పోషక విలువల సమాచారం, ఫ్సాసాయ్ లైసెన్స్ వివరాలు, తయారీదారుల చిరునామా లేకపోవడాన్ని గుర్తించారు.

బఫెట్ ఏరియాలో లోపాలు ....

మాంసం వ్యర్థాలతో డ్రైనేజీలు పూడుకుపోయి, తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. పురుగులు పట్టిన స్వీట్లు, నూనెలు, పిండి పదార్థాలు, పప్పుధాన్యాలతో సహా సుమారు 150 కిలోల ఆహార పదార్థాలను అధికారులు పారవేశారు. కల్తీ జరిగినట్లు లేదా రంగులు ఎక్కువగా వాడినట్లు అనుమానం ఉన్న ఆహార నమూనాలను, అలాగే పురుగులు పట్టిన శనగపిండి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

## మోడీ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఏపీలో స్వర్ణకారుల ఆందోళన

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: బంగారం కొనుగోలు చేయొద్దని పీఎం మోడీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ విజయవాడలో కామాక్షి గోల్డ్ స్మిత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. బ్యానర్ చేతబూని భారీ ర్యాలీ తీశారు. పీఎం మోడీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మాటలతో బంగారు తయారీ వృత్తదారులపై పెను ప్రభావం చూపనుందని, తమ జీవనోపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలిసి తమ సమస్యలను తెలియజేస్తామని ఆ సంఘం లీడర్లు పేర్కొన్నారు. స్వర్ణకార కార్మికులు, వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఆదిలాబాదు పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదాం : 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'కు కలెక్టర్ రాజర్షి షా పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం మావల పార్క్‌లో నిర్వహించిన ప్రెస్ టూర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో కలిసి సఫారీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిలాబాదు జిల్లాలోని అద్భుతమైన ప్రకృతి సంపద, జలపాతాలు, చారిత్రక వైభవం, స్థానిక ఆదివాసీ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు పరిచయం చేసేందుకు జిల్లా యంత్రాంగం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ పోటీల నిర్వహణ వల్ల జిల్లా పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించడమే కాకుండా, స్థానిక కంటెంట్ క్రియేటర్ల ప్రతిభ వెలుగులోకి వస్తుందని అన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్స్ అందరూ అర్హులని స్పష్టం చేశారు. పోటీదారులు ఆదిలాబాదు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, ప్రకృతి అందాలు, జలపాతాలు, చారిత్రక కట్టడాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా రీల్స్ లేదా వీడియోలను రూపొందించాల్సి ఉంటుందని తెలిపారు. పోటీకి పంపే వీడియోలు తప్పనిసరిగా అత్యుత్తమ నాణ్యతతో కూడిన 4ఖ ఫార్మాట్‌లో ఉండాలన్నారు. ఈ నెల మే 21 గురువారం ఉదయం 11గంటల లోపు ఆసక్తి గల క్రియేటర్లు తమ సొంత పెన్‌డ్రైవ్ ద్వారా జిల్లా కేంద్రం లోని విద్యుత్ తరంగిని ఫంక్షన్ హాల్ లో నేరుగా వీడియోలను అందజేయాలన్నారు. సందేహాలు, సలహాల కోసం జిల్లా పర్యాటక శాఖ అధికారి వి. రవికుమార్ -- 9440816087, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఇ. విష్ణువర్ధన్ -- 9154170902 లను సంప్రదించవచ్చని తెలిపారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రియేటర్లకు జిల్లా యంత్రాంగం తరఫున ప్రథమ బహుమతిగా rs5,000/-, ద్వితీయ బహుమతిగా rs4,000/-, తృతీయ బహుమతిగా rs3,000/- నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాదు జిల్లా, పరిసర ప్రాంతాలలోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకుని జిల్లా పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకం చేపట్టాలి

## సబ్సిడీపై వాహనాలు, ఐస్ బాక్సుల పంపిణీకి ప్రణాళికలు : సదస్సులో జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా




సమావేశం హాజరైన ప్రజలు

అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ గిరిజన ప్రాంతాల్లోని మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఉట్నూర్ ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీఓ) మంద మకరంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన మత్స్యకారులు కేవలం సాంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా మత్స్య శాఖ అధికారులు సూచించే ఆధునిక చేపల పెంపక విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలోని గిరిజన జలాశయాలు, చెరువుల్లో మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీలు, రాయితీలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గిరిజన మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చేపల ఉత్పత్తి మాత్రమే కాకుండా వాటి రవాణా, మార్కెటింగ్‌కు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలు, ఐస్ బాక్సుల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. సంఘాల్లోని ప్రతి సభ్యునికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఐటిడిఎ పీఓ మాట్లాడుతూ, గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల బలోపేతానికి ఐటిడిఎ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గిరిజన యువత ఆధునిక సాంకేతికతను వినియోగించి మార్కెటింగ్ రంగంలో కూడా రాణించాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయాలు చేపడితే అధిక లాభాలు పొందవచ్చన్నారు. గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు మత్స్య రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటిడిఎ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. ఆధునిక వలలు, మోటార్ బోట్లు, ఇతర పరికరాల కొనుగోలుకు రాయితీ రుణాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి లాయక్ మొహమ్మద్దీన్, ఆర్డీవో కూనలా గంగాధర్, మత్స్య శాఖ అధికారులు, గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ యువతలో నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా మంగళవారం జడ్పి సమావేశ మందిరంలో యువతకు కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం యువతలో నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని, యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా ప్రైవేట్ రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జీవితంలో ఎప్పుడూ 'ప్లాన్-బి'తో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఉట్నూరు ATC, ఐటిఐలలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టాటా మోటార్స్ వంటి ప్రముఖ కంపెనీల్లో ఉచిత వసతితో పాటు రూ.17,000 ప్రారంభ వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. అలాగే యువతకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌కు సొంత భవనం కూడా మంజూరైందని వెల్లడించారు. పోటీ పరీక్షల్లో, ఇంటర్వ్యూలలో రాణించడానికి కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాలు కీలకమని స్పష్టం చేశారు. యువత కనీసం 10వ తరగతి స్థాయి బేసిక్ మ్యాథమెటిక్స్‌పై పట్టు సాధించాలని, ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) పాత్ర పెరిగినందున, దీనిపై అవగాహన పెంచేందుకు జిల్లా యువత కోసం ప్రత్యేకంగా ఒకటి లేదా రెండు రోజుల సదస్సులు నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" పోస్టర్‌ను ఆవిష్కరించారు. తదుపరి యువత నైపుణ్య శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్న ప్రతినిధులను, అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సదస్సులో డివైఎస్ఓ శ్రీనివాస్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, జిల్లా ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, ఉట్నూరు, ఆదిలాబాదు ATC ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, శ్రీనివాస్, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్, రమేష్, NTT డేటా ప్రతినిధి మల్లికార్జున్, కళా అకాడమీ లెక్చరర్ వైష్ణవి, ఎన్‌లాప్స్ ఇండియా ప్రతినిధి ప్రణవి, యువతీ యువకులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాదు మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస వసతులు సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేకంగా చర్చించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన వాహనాల (ట్రాన్స్‌పోర్ట్) లభ్యత హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జొన్నలు విక్రయించిన రైతులకు నగదు చెల్లింపులు (పేమెంట్స్) సకాలంలో, వేగంగా జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్, మార్కెటింగ్, ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రూ.5కే మధ్యాహ్న భోజనం

## ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రత్యేక వసతి ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



రైతులకు అన్నం పెడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి దృశ్యం

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు రూ. 5కే మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని సోమవారం మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సౌజన్యంతో, ఇస్కాన్ సొసైటీ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మార్కెట్ యార్డుకు వచ్చే మొక్కజొన్న, జొన్న రైతులకు తక్కువ ధరకే మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ కృషి చేస్తోందని పేర్కొన్నారు.రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని, మార్కెట్ యార్డుకు వచ్చే ప్రతి రైతుకు మౌలిక వసతులు, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలతో పాటు భోజన వసతి కూడా అందుబాటులో ఉంచుతున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వై. గజానంద్, మార్కెట్ సిబ్బంది, ఇస్కాన్ సొసైటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ కూతురి వివాహ వేడుకకు హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ హైదరాబాద్‌లోని మెట్రో క్లాసిక్ గార్డెన్‌లో సోమవారం రాత్రి మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ కూతురి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌తో పాటు పెళ్లి కుమారుడు మహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్‌ను కలిసి ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సన్నిహితులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ కొరకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలి : జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలి

అమృత్ తెలంగాణ 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలని, లేదా సవరించాలని మతం మారితే కులం మారదని, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు సంపత్ కుమార్, విజయ్ కుమార్, అన్నారు. మంగళవారం మండలంలోని వాడియాల గేట్ టి ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ లో రాజ్యాంగం దళిత క్రైస్తవులు సామాజిక న్యాయం రౌండ్ టేబుల్ సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళితులు బౌద్ధ ,సిక్కు మతం స్వీకరిస్తే దళితులుగానే ఉంటున్నారని ,క్రైస్తవ మతం స్వీకరిస్తేనే ఎస్సీ హోదా రద్దు అనేది పాలకుల కుట్రని విమర్శించారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దుచేసి మతం మారిన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులందరూ ఎస్సీ హోదా సాధించేవరకు ఐకమత్యంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# మొక్కజొన్న దాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఆటంకాలు కలగకూడదు : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ మొక్కజొన్న దాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సాయంత్రం, బైంసా మండలం మాటేగాం గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ప్రతి రికార్డును స్పష్టంగా నిర్వహించాలన్నారు. పలు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఇప్పటివరకు కేంద్రానికి వచ్చిన ధాన్యం, తూకం వేసి గోదాములకు తరలించిన దాన్యం వివరాలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో దాన్యం నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, కొనుగోలుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలు పై రైతుల ఎటువంటి ఆందోళన పడవలసిన అవసరం లేదని, సమయానికి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, రైతులు తగిన చర్యలు తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని వివరించారు. స్థానికంగా ఉన్న హమాలీలతో మాట్లాడుతూ, ధాన్యం తరలింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. షిఫ్టులవారీగా పనిచేస్తూ లోడింగ్ ప్రక్రియ చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ తర్వాత స్థానిక గోదామును పరిశీలించారు. అనంతరం కోతుల్ గావ్ గ్రామంలో గల గోదామును పరిశీలించారు. గోదాము నిల్వ సామర్థ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న స్థలాలలో ధాన్యపు సంచులు నిల్వ ఉంచుకోవాలని వివరించారు ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, తహసిల్దార్ శశి భూషణ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువతకు నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమం






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రంలో యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యువత నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధికారులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి యువతకు అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్సుడ్ టెక్నాలజీ లప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత సాంకేతికతకు తగ్గట్టుగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కల్పనలో యువతకు ఏ విధంగా తోడ్పాటు అందిస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఎల్డీఎం రాంగోపాల్, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటిఐ అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులకు వెన్నెముకగా "సాయుధ సిబ్బంది" : సిబ్బంది అందరికి సమానమైన విధులు

**ప్రజలను పోలీసు కీర్తి ప్రతిష్టలు భంగం వాటిల్లకుండా విధుల నిర్వహణ జరగాలి.**

**సాయుద సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ధర్బర్ ఏర్పాటు : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులకు వెన్నెముకగా ఉంటూ తమ వంతు పాత్ర పోషిస్తూ ప్రజారక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్న సాయుధ సిబ్బంది పాత్ర గొప్పదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అభివర్ణించారు. ఈరోజు సాయిధ సిబ్బందతో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారికి గల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్న నిర్భయంగా ఉన్నతాధికారులను సంప్రదించి సామరస్యంగా లేదా చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని తెలిపారు. పిల్లలకు మంచి చదువును అందించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, భవిష్యత్తుపై ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లాలో ఉన్న ఐపీఎస్ అధికారుల సలహాలను సూచనలను తీసుకోవచ్చని హితవు పలికారు. మంచి ప్రవర్తనతో ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలు పెరిగిన విధుల నిర్వహణ చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సిబ్బంది అందరూ ఇతరులకు ఇచ్చే స్యూరిటీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సిబ్బంది అందరికీ ఒక చక్కటి టర్మ్ పాలసీ, హెల్త్ పాలసీ తీసుకోవడం మంచిదని, కష్టకాలంలో ఎవరి సహాయం అవసరం లేకుండా అవి ఉపయోగపడతాయని సూచించారు. పోలీసు ముఖ్య కార్యాలయం నందు



హాజరైన పోలీస్ అధికారులు

ఎలాంటి సమస్యలున్న నేరుగా సిబ్బందిని సంప్రదించవద్దని, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుని ద్వారా తమ సమస్యలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. సిబ్బందికి కుటుంబంలో మరియు సమాజంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కి సిబ్బంది పలువురు తమ వ్యక్తిగత సమస్యలను మరియు శాఖ పరమైన సమస్యలను తెలియజేయడం జరిగింది, వాటిని తక్షణమే పరిష్కరిస్తానని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్ర వర్ధన్, ఆర్ఐలు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు దేవేందర్, వినోద్, మహేష్, గబ్బర్ సింగ్, ఆశన్న, ఏ ఆర్ ఎస్ ఐ లు హెడ్ కానిస్టేబుళ్లు కానిస్టేబుల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# హమ్మయ్య ఆ హీరోయిన్ హిట్టు కొట్టిందోచ్..!



రొమాంటిక్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన కెతిక శర్మ తెరంగేట్రం చేసిన 4 ఏళ్ల తర్వాత హిట్ అందుకుంది. అందాల భామ కెతిక శర్మ ఆకాష్ పూరీ చేసిన రొమాంటిక్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అంతకుముందు డబ్ స్మాష్ వీడియోలతో సోషల్ మీడియాలో క్రేజీ ఫాలోయింగ్ ఏర్పరచుకున్న అమ్మడు తెలుగు ఆఫర్ అందుకోగానే సూపర్ అనిపించుకుంది. ఐతే రొమాంటిక్ సినిమాలో కెతిక గ్లామర్ షో మెప్పించినా సినిమా వర్క్ అవుట్ కాలేదు. ఇక ఆ తర్వాత అశ్వద్ధామ చేసినా అది తుస్సుమన్నది. హీరోయిన్ గా చేసిన సినిమాలు ఫ్లాప్ అయితే ఆ కథానాయికలకు అవకాశాలు రావడం కష్టం. కెతిక విషయంలో కూడా అదే జరిగింది. ఈ క్రమంలోనే పవన్ కళ్యాణ్, సాయి ధరం తేజ్ చేసిన బ్రో సినిమాలో కూడా నటించింది కెతిక. అది కూడా అంతగా కెరీర్ కి హెల్ప్ అవ్వలేదు. ఐతే కెరీర్ డైలమాలో పడిన ఈ అమ్మడు శ్రీవిష్ణు సినిమా ఛాన్స్ అందుకుంది. సింగిల్ అంటూ వచ్చిన సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. వణుకు పుట్టించే హారర్ కామెడీతో కమెడియన్ రొమాంటిక్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన కెతిక శర్మ తెరంగేట్రం చేసిన 4 ఏళ్ల తర్వాత హిట్ అందుకుంది. సింగిల్ సినిమాలో కెతిక లుక్స్ కూడా చాలా బాగున్నాయి. అమ్మడు కాస్త స్లిమ్ గా మారినట్టుగా ఉంది. అవకాశాల కోసం తమని తాము మార్చుకునే హీరోయిన్స్ కి కచ్చితంగా టాలీవుడ్ లో మంచి ఎంకరేజ్ మెంట్ ఉంటుంది. రొమాంటిక్ సినిమాతోనే తెలుగు ఆడియన్స్ లో హాలిలిట్ ఇమేజ్ తెచ్చుకున్న కెతిక ఫైనల్ గా సింగిల్ తో సక్సెస్ రుచి చూసింది ఈ సింగిల్ ఇచ్చిన హిట్ జోష్ తో కెతిక ఇక మీదట ఇదే సక్సెస్ ఫాం కొనసాగిస్తుందేమో చూడాలి. సినిమా కథల విషయంలో హీరోయిన్స్ అందరు చేసే తప్పులనే చేస్తూ వచ్చింది కెతిక శర్మ. కేవలం రెండు డైలాగ్స్, 3 పాటల్లో కనిపించే సినిమాలు చేసినా లెక్క పెట్టుకోవడానికి తప్ప కెరీర్ కు ఎలాంటి ఉపయోగం ఉండదు. ఐతే ఇప్పుడిప్పుడే రియాలిటీని అర్థం చేసుకుంటున్న కెతిక ఇక మీదట కథల విషయంలో జాగ్రత్త పడే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. సింగిల్ హిట్ జోష్ లో ఉన్న కెతిక ఇదే ఊపులో మరో సినిమా అవకాశం అందుకుని అది కూడా సక్సెస్ కొడితే మాత్రం ఇక అమ్మడికి టాలీవుడ్ కెరీర్ కి ఇబ్బంది ఉండదని ఫిక్స్ అవ్వొచ్చు.

# నాగార్జున సెంచరీ గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ లోనా!




కింగ్ నాగార్జున 100 చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ల్యాండ్ మార్క్ చిత్రం కావడంతో? పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. కింగ్ నాగార్జున 100 చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ల్యాండ్ మార్క్ చిత్రం కావడంతో? పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. స్టోరీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వడంలేదు. ఇప్పటికే చాలా మంది దర్శకులు స్టోరీలు వినిపించారు. కానీ ఆవేవి కింగ్ ని మెప్పించలేకపోయాయి. నచ్చిన స్టోరీల విషయంలో సరైన డెవలప్ మెంట్స్ కుదరడంతో ముందడుగు పడలేదు. ఈ నేపథ్యంలో తమిళ్ డైరెక్టర్ రా కార్తీక్ పేరు తెరపైకి వచ్చింది. ఇతడేమి స్టార్ డైరెక్టర్ కాదు. సక్సెస్ రికార్డులేవు. రెండు చోట్లా కూడా ఈ సినిమా పెద్దగా ఆడలేదు. అయితే నాగ్ ఇప్పుడీ డైరెక్టర్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇటీవలే స్టోరీ వినిపించినట్లు ఇప్పటికే ప్రచారంలో ఉంది. వణుకు పుట్టించే హారర్ కామెడీతో కమెడియన్ తాజాగా ఇదొక మాఫియా బ్యాక్ డ్రాప్ లో డిఫరెంట్ జోనర్ కథ అని తెలిసింది. స్టోరీలో ఆ పాయింట్ కే నాగార్జున ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రథమార్ధం పూర్తి స్టోరీని నేరేట్ చేసాడట. అది నాగ్ కి బాగా నచ్చింది. ప్రస్తుతం ద్వితియార్ధం కథ రెడీ అవుతుందని సమాచారం. ఇటీవలే స్టోరీకి సంబంధించి పనులు ఎంతవరకూ వచ్చాయని నాగార్జున స్వంయగా ఫోన్ చేసి వివరాలు ఆరా తీసారట. అందుకు కార్తీక్ మరో రెండు..మూడు నెలలు సమయం పట్టొచ్చాని చెప్పారట. దీంతో నాగ్ కూడా కావాల్సినంత సమయం తీసుకుని ద్వితి యార్థం బాగా ఉండేలా చూడమన్నారట. సెకెండ్ హాఫ్ నచ్చితే నాగ్ సెంచరీ కన్ఫమ్ అయినట్లే. ప్రస్తుతం నాగార్జున 'కూలీ','కుభేర' చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రెండు సినిమా కథలు కూడా గ్యాంగ్ స్టర్ స్టోరీలే. దీంతో నాగ్ ఆ స్టోరీలకు బాగా కనెక్ట్ అయినట్లు కనిపిస్తుంది.

# నోరాతో పోటీపడలేక చేతులెత్తేసారు



ఇటీవల విడుదలైన నెట్ఫ్లిక్స్ సిరీస్ లో ఎవరు ముచ్చటించినా నోరా లుక్స్ గురించి , అందం గురించి మాత్రమే మాట్లాడుకుంటున్నారు. బాహుబలి మనోహరిగా నోరా ఫతేహికి ఉన్న గుర్తింపు అంతా ఇంతా కాదు. యూత్ లో నోరాను ఆరాధించి, ప్రేమించే వీరాభిమానులు న్నారు. అందుకే బాలీవుడ్ లో ఎంత పోటీ ఉన్నా, కెరీర్ పరంగా క్షణం తీరిక లేకుండా ఏల్తోంది. తనదైన అందం ఆకర్షణ, అద్భుతమైన డ్యాన్సింగ్ నైపుణ్యంతో నోరా ఫతేహి ఈ డికేడ్ లో గుబులు పుట్టిస్తోంది. ఇటీవల విడుదలైన నెట్ఫ్లిక్స్ అందం గురించి మాత్రమే మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా నోరా బంగారు రంగు బికినీలో గుబులు రేపిన తీరు గురించి చర్చిస్తున్నారు. ఇందులో భూమి పెడ్నేకర్ లాంటి భామ రసవత్తరమైన సన్నివేశాల్లో కనిపించినా కానీ, నోరాషో స్టాపర్ గా నిలిచింది. ఇక ఇందులో ఇషాన్ ఖట్టర్ , భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రల్లో నటించగా, నోరా పరిమిత సమయం మాత్రమే కనిపిస్తుంది. జీనత్ అమన్, సాక్షి తన్వర్, విహాన్ సమత్, మిలింద్ సోమన్, చంకీ పాండే వంటి ప్రతిభావంతులైన తారలు ఈ సిరీస్ లో నటించారు. కానీ ఇది చెత్త కథ, కథనాలతో విసిగించిందని రివ్యూవర్లు పేర్కొన్నారు. ఈ సిరీస్ కి ప్రధాన ఆకర్షణ ఏది? అంటే నోరా ఫతేహి అందచందాలు, బికినీ యాక్ట్ అని చెబుతున్నారు. నోరా ఫోటోలు వీడియోలు కూడా అంతర్జాలంలో వైరల్ అవుతున్నయి. నోరా ది రాయల్స్ లో ప్రిన్సెస్ ఆయేషా అనే పాత్రలో నటించింది. ఇషాన్ ఖత్తర్ మాజీ ప్రేయసిగా స్టీమీ సన్నివేశాల్లో జీవించింది.



మేఘా హాట్ ఇన్ శారీ

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com